


స్త్రీనిధి...ప్రగతి నిధి

అతివలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీనిధి పథకం వరంలా మారింది. వివరాలు 10లో ▸



కందకాలు.. భూగర్భ జలాలు

భూగర్భ జలాలు అడుగంటకుండా ఉపాధి హామీ పనుల్లో కందకాలు తవ్వుతున్నారు. వివరాలు 10లో ▸



చీడపీడల నివారిణి..

వేపమందు పిచికారీతో చీడపీడల నివారించవచ్చని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ చెబుతున్నారు. వివరాలు 11లో ▸

దిశ తప్పిన సమావేశం



దిశ సమావేశంలో ఎంపీలు సురేశ్‌షెట్కార్, రఘునందన్‌రావు, కలెక్టర్ క్రాంతి, నిర్మలారెడ్డి తదితరులు

జిల్లా డెవలప్‌మెంట్ కో ఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం గాడి తప్పింది. ఈ సమావేశంలో గుత్తేదారులే అధికారులుగా అవతారమెత్తారు. అయితే అడిగే ప్రశ్నలకు వీరు సమాధానాలు చెప్పడానికి నీళ్లు నమిలారు. దీంతో అనుమానమొచ్చిన ప్రజా ప్రతినిధులు నిలదీయడంతో అసలు గుట్టు బయటపడింది.

- కాంట్రాక్టర్ల కలకలం
- సమావేశానికి గుత్తేదార్లను పంపిన ఎన్‌హెచ్ఏఐ అధికారులు
- బయటకు పంపిన ప్రజాప్రతినిధులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లా డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశంలో కాంట్రాక్టర్లు అధికారుల అవతారమెత్తారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులకు బదులుగా కాంట్రాక్టు కంపెనీకి చెందిన ప్రతినిధులే ఫైళ్లతో సమావేశానికి హాజరై ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ క్రమంలో వారు తడబడటంతో అనుమానం వచ్చి వారి డిజిగ్నేషన్ అడగడంతో తాము అధికారులము కాదని, కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులమని చెప్పడం కలకలం రేగింది. దీంతో వారిని సమావేశం నుంచి బయటకు పంపించేశారు. దిశ సమావేశం ఉన్నట్లు డీఆర్‌డీఏ అధికారులు సకాలంలో సమాచారం ఇవ్వకపోవడంతో తాము రాలేక పోయామని అధికారులు చెప్పినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును సమీక్షించేందుకు ప్రతీ మూడు నెలలకు ఒకసారి జరిగే ఈ కీలక సమా వేశం నిర్వహణ తీవ్ర విమర్శలకు దారితీసింది. దిశ చైర్మన్, జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్ అధ్యక్షత బుధవారం జరిగిన ఈ సమావేశంలో కో చైర్మన్, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీలు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను ఈ సందర్భంగా సభ్యులు సమీక్షించారు.

జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్లు..

జిల్లాలోని నాందేడ్–అకోలా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఎంపీ సురేశ్‌షెట్కార్ ప్రస్తావించారు. సుల్తాన్‌పూర్, సింగూరు చౌరస్తా వంటి చోట్ల ఈ బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని, ఆయా ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలకు సంబంధించిన పనుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని అధికారులు పేర్కొన్నారు. ఫ్లై ఓవర్ల నిర్మాణానికి సర్వేలు చేయాలని రఘునందన్‌రావు సూచించారు. పటాన్‌చెరు నుంచి ఆర్సీపూర్ వరకు 150 ఫీట్ల రోడ్డు ఆక్రమణలను తొలగించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి సూచించారు.

పత్తి కొనుగోళ్లలో భారీ కుంభకోణం..

పత్తి కొనుగోళ్లలో భారీ కుంభకోణం జరిగిందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని ఎంపీ షెట్కార్ సమావేశం దృష్టికి తెచ్చారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మార్కెటింగ్ అధికారులు, దళారులంతా ఏకమై పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అయితే సమావేశానికి మార్కెటింగ్ శాఖ అధికారులు గైర్హాజరు కావడం పట్ల ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు.

టీచర్ల డిప్యూటేషన్లు రద్దు చేయండి

మారుమూల తండాల్లో పనిచేస్తోన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్లపై పట్టణ ప్రాంతాలకు పంపడంతో తండాల్లోని నిరుపేద విద్యార్థులకు చదువు చెప్పే వారే లేకుండా పోయారని దిశ కమిటీ సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. చదువు చెప్పేవారు లేకపోవడంతో చిన్నారులు రోడ్లపై ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణం ఈ డిప్యూటేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఒక్కడే వెయ్యి ఇళ్లు

అమీన్‌పూర్ పట్టణంలో ప్రభుత్వ స్థలాల్లో చిన్న గది కట్టడం..దానికి తప్పుడు డబ్ల్యూపీ నంబర్ వేయడం.. ఒక్కో ఇంటిని రూ.20 లక్షలకు విక్రయించడం..ఇలా ఒక్కడే సుమారు వెయ్యి ఇండ్లు ప్రభుత్వ స్థలాల్లో కట్టి అమ్ముకుంటుంటే ఏం చేస్తున్నారని ఎంపీ రఘునందన్‌రావు అధికారులను నిలదీశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులను వీటిని ఎందుకు కూల్చివేయడంలేదని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్ క్రాంతి స్పందిస్తూ ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదే పటాన్‌చెరులో రూ.కోట్ల విలువ చేసే సహకార సంఘం ఆస్తులు కబ్జాకు గురవుతుంటే జిల్లా కోఆపరేటివ్ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు.

అంగన్‌వాడీలకు వేతన పెంపు

- ప్రభుత్వం నిర్ణయం.. సిబ్బందిలో సంబురం
- మినీ కేంద్రాల టీచర్లకు రూ.13,650 వేతనం
- జిల్లాలో 138 కేంద్రాలకు ప్రయోజనం
- కొత్తగా ఆయాల నియామకానికి అవకాశం



నారాయణఖేడ్: రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు వారికి వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వేతనం పెంపు ప్రకటిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఎన్నో రోజులుగా వేతనాల పెంపుకోసం ఎదురుచూస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లలో సంతోషం నెలకొంది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 138 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలో నారాయణఖేడ్, జోగిపేట్, సదాశివపేట్, జహీరాబాద్, పటాన్‌చెరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 138 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ఈ కేంద్రాల టీచర్లకు వేతనం ఇదివరకు రూ.7,800 చెల్లిస్తుండగా పెంచిన వేతనం రూ.13,650గా చెల్లించనున్నారు. ఎన్నో రోజులుగా వేతనాల పెంపుకోసం ఎదురు చూస్తున్న వీరిలో సంతోషం నెలకొంది.

ఏడాదిక్రితం అప్‌గ్రేడ్..

మినీ అంగన్‌వాడీ కేంద్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాది క్రితం ప్రధాన అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేశారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాల సమస్య మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లడంతో అప్‌గ్రేడేషన్‌కు హామీ ఇచ్చారు. కాగా, నాటి నుంచి కూడా వేతనం పెంచలేదు. అయితే ప్రస్తుతం వీరికి వేతనం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన వేతనం ఏప్రిల్ నెలనుంచి అమలులోకి రానుంది. అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతనంగా ఆయాల నియామకం కూడా ప్రభుత్వం చేపట్టనుంది. దీంతో జిల్లాలో మరో 138మంది ఆయాల నియామకం జరగనుంది. దీంతోపాటు నూతన కేంద్రాల ఏర్పాటుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. కొత్తగా ప్రభుత్వం 81 కేంద్రాలను మాత్రమే రాష్ట్రంలో మంజూరు చేసింది. జిల్లాలో 73 నూతన అంగన్‌వాడీ కేంద్రాలు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఇందులో జిల్లాలకు ఎన్ని దక్కుతాయో తెలియని పరిస్థితి.

వేతనాల పెంపు సంతోషం



మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయడంతోపాటు వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం సంతోషం. నియామకం అయినప్పటి నుంచి టీచర్‌గా, ఆయాగా తక్కువ వేతనానికే పనిచేస్తున్నాం.

– ప్రియాంక, మినీ అంగన్‌వాడీ టీచర్, బిబ్యాతండా

పోరాటాల ఫలితం..



మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలంటూ వారి పక్షాన ఎన్నో పోరాటాలు చేశాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. తమ పోరాటాల ఫలితంగానే న్యాయం జరిగింది.

– చిరంజీవి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు, నారాయణఖేడ్

138 కేంద్రాలు అప్‌గ్రేడ్



మినీ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి జిల్లాలో 138 అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్ అయ్యాయి. వారికి వేతనాలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 138 కేంద్రాల టీచర్లకు ప్రయోజనం చేకూరింది.

– లలితకుమారి, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, సంగారెడ్డి

అడ్డొస్తున్నాయని చెట్లను కొట్టేశారు

గ్రామస్తుల ఆగ్రహం



జేసీబీతో కొట్టేసిన చెట్లు

నారాయణఖేడ్: ఐదేళ్ల క్రితం రోడ్డుకిరువైపులా పెంచిన చెట్లు కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్నాయన్న కారణంతో విద్యుత్ అధికారులు వాటిని అడ్డంగా నరికేశారు. అకోలా–హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి జంబికుంట గ్రామం వరకు రోడ్డు కిరువైపులా మాజీ సర్పంచ్ సాయమ్మ ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితం అల్లనేరేడు, బాదం మొక్కలతోపాటు ఇతర మొక్కలను నాటారు. ఇలా ఈ దారి వెంట సుమారు 100కు పైగా మొక్కలు నాటగా అవి ఏపుగా పెరిగి నీడనిస్తున్నాయి. అయితే ఈ చెట్లు కరెంటు తీగలకు అడ్డొస్తున్నాయన్న సాకుతో బుధవారం విద్యుత్ అధికారులు జేసీబీతో చెట్లను నరికించేశారు. దీంతో నిజాంపేట మండలం జంబికుంట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కొమ్మలు మాత్రమే తొలగించి చెట్లకు నష్టం కలుగకుండా చూడాల్సిన అధికారులు ఇలా నరికివేయడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి గ్రామస్తులు కోరుతున్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మి

సాక్షి ఎఫెక్ట్

వట్‌పల్లి(అందోల్): యాసంగి సీజన్‌లో జొన్నపంట సాగుచేసిన రైతులు మండలంలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో నెలరోజులుగా ధాన్యాన్ని ఇళ్లలోనే నిల్వ ఉంచడంపై ఈ నెల 5న 'సాక్షి'దినపత్రికలో 'జొన్నల కొనుగోలు ఎప్పుడో'శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారుల్లో కదలిక వచ్చింది. ఈ కథనానికి స్పందించిన మార్క్‌ఫెడ్ ప్రాథమిక సహకార సంఘం అధికారులు బుధవారం దేవునూర్ రైతువేదిక భవనంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏయంసీ చైర్మన్ కొప్పుల లక్ష్మీ మాట్లాడుతూ...రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర రూ.3,371కు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, డైరెక్టర్ బుద్దిరెడ్డి, ఏయంసీ డైరెక్టర్ దిగంబర్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్ జోషి, తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యాన్ని చూసి గర్వపడుతున్నా

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి రూరల్: దేశంలో ఉగ్రవాదానికి స్థానం లేదని, పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం చేసిన దాడులు, చూపిన ధైర్య సాహసాల పట్ల గర్వంగా ఉందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉగ్రవాద స్థావరాలనే లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'ను ప్రశంసించారు. ఉగ్రవాదం అంతం కావాల్సిందే అన్నారు. ప్రతి ఒక్కరు భారత సైన్యానికి ఉండగా నిలవాలని కోరారు.

దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గానూ డిగ్రీలో ప్రవేశాల కోసం జిల్లాస్థాయి దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్.రత్న ప్రసాద్, దోస్త్ సమన్వయకర్త డాక్టర్ జగదీశ్వర్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దోస్త్ ప్రవేశాలకు సంబంధించి సందేహాలకు తారా కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా హెల్ప్ లైన్ సెంటర్‌ను నేరుగా గానీ, మొబైల్ నంబర్లు 94410 69020, 7989239115కు గానీ సంప్రదించాలని సూచించారు. సమీప మీసేవ కేంద్రాల ద్వారా దోస్త్ అప్లై చేసుకుని డిగ్రీలో ప్రవేశాలు పొందవచ్చన్నారు.

సేంద్రియ సాగుపై పరిశోధనలు చేయాలి

ఎఫ్ఆర్ఎస్ సందర్శనలో ఉద్యాన వర్సిటీ వీసీ



ఎఫ్ఆర్ఎస్‌లో నర్సరీని పరిశీలిస్తున్న వీసీ రాజిరెడ్డి

సంగారెడ్డి: సేంద్రియ పద్ధతులపై విస్తృత పరిశోధనలతో పాటుగా సేంద్రియ సాగుపై రైతులకు పూర్తి అవగాహన కల్పించేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.డి.రాజిరెడ్డి పేర్కొన్నారు. ఈయనతోపాటు రిజిస్ట్రార్ డా.ఎ.భగవాన్ బుధవారం ఉద్యాన వర్సిటీలోని ఫల పరిశోధన కేంద్రం(ఎఫ్ఆర్ఎస్)ను సందర్శించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ...నర్సరీలో మామిడి, జామ మొక్కల సంఖ్య పెంచేందుకు సాంకేతికతను ఉపయోగించాలన్నారు. పరిశోధనలు సమగ్ర యాజమాన్య పద్ధతులతో కూడుకుని తక్కువ రసాయనాలతో ఉండాలని సూచించారు. అనంతరం క్షేత్ర సందర్శనలో భాగంగా డ్రాగన్ ఫ్రూట్, అవకాడొ, మామిడి, జామ, నేరేడు, సీతఫలంలో జరుగుతున్న పరిశోధనలను చూసి శాస్త్రవేతలకు వీసీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేతలు హరికాంత్, మాధవి, మానిక, నితీశ్, ఫల పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విస్తరణకు మోక్షం ఎప్పుడో!

- అంతర్రాష్ట్ర రవాణా సౌకర్యం కోసం ప్రతిపాదన
- జహీరాబాద్–చించోళి–బీదర్ రహదారి విస్తరణకు కేంద్రం ఆమోదం
- నాలుగేళ్లయినా నిధులు విదల్చని కేంద్రం



జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్రం ఆమోదించిన జహీరాబాద్–చించోళి రహదారి

జహీరాబాద్: అంతర్రాష్ట్ర రవాణా సౌకర్యం కల్పించేందుకు వీలుగా రోడ్లు, భవనాల మంత్రిత్వ శాఖ (ఆర్అండ్‌బీ) రోడ్లను జాతీయ రహదారులుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసి ఏళ్లు గడుస్తున్నా వాటికి ఇప్పటికీ మోక్షం లభించడం లేదు. జహీరాబాద్–చించోళి రహదారిని జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ 2022 సంవత్సరంలో ఆమోద ముద్ర వేసింది. ఈ రహదారి రోడ్డు భవనాల శాఖ అధీనంలో ఉంది. దీన్ని జాతీయ రహదారిగా విస్తరించి జహీరాబాద్‌కు దక్షిణాన ఉన్న కర్ణాటకలోని చించోళి వరకు విస్తరించాలని ప్రతిపాదించింది. దీంతో పాటు అప్పట్లో ఎల్లారెడ్డి–మెదక్ రహదారిని సైతం విస్తరించేందుకూ ఆమోదించింది. ఈ రెండు రహదారుల విస్తరణకుగాను రూ.900 కోట్ల మేర నిధులు అవసరం అవుతాయని అంచనా వేసింది. క్షేత్రస్థాయి పరిశీల అనంతరం టెండర్ల ప్రక్రియ మొదలవుతుందని అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయినా ఇప్పటివరకు క్షేత్రస్థాయి పరిశీలనకు కూడా నోచుకోలేక పోయింది.

ప్రయాణ సమయం ఆదా...

చించోళి రహదారిని నిర్మించడం ద్వారా అంతర్రాష్ట్ర రవాణాకు సౌకర్యం కలుగుతుంది. జహీరాబాద్ నుంచి చించోళి మధ్య సుమారు 50 కిలోమీటర్ల మేర రహదారి ఉంది. ఇది ప్రస్తుతం రోడ్డు భవనాల శాఖ అధీనంలో ఉంది. జహీరాబాద్ నుంచి మండల కేంద్రమైన మొగుడంపల్లి మీదుగా ఈ రహదారి ఉంది. ఈ రహదారిని గత నాలుగేళ్ల క్రితమే మొగుడంపల్లి వరకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసింది. ఈ రహదారి రాష్ట్ర పరిధిలో సుమారు 25 కిలోమీటర్ల మేర ఉంటుంది. మరో 25 కిలోమీటర్ల మేర కర్ణాటక పరిధిలోకి వస్తుంది. ఈ రహదారిని నిర్మిస్తే ఆయా ప్రాంతాల మధ్య మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. అంతేకాకుండా ప్రయాణ సమయం కూడా తగ్గుతుంది. చించోళిలో గల చక్కెర కర్మాగారానికి జహీరాబాద్ ప్రాంతానికి చెందిన రైతులు చెరకు ఉత్పత్తులను అధికంగా తరలించుకుంటారు. రహదారిని నిర్మిస్తే రైతులకు సైతం సౌకర్యంగా మారుతుంది.

నాలుగేళ్ల క్రితమే ప్రతిపాదన



జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్రం ప్రతిపాదించిన జహీరాబాద్–బీదర్ రహదారి

నాలుగేళ్ల క్రితం కేంద్రం జహీరాబాద్–బీదర్ రహదారిని జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్రం ఆమోదించింది. ఈ రహదారి రాష్ట్ర పరిధిలో 18 కిలోమీటర్లు, కర్ణాటక పరిధిలో 9 కిలోమీటర్ల మేర ఉంది. ఈ రహదారిని జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్రం ఆమోదించినప్పటికీ నిధులు మంజూరు చేయలేదు. రహదారిని జాతీయ రహదారుల అథారిటీకి సైతం ఇంతవరకు బదిలీ చేయలేదు. ఇప్పటికీ రోడ్డు భవనాల శాఖ అధీనంలోనే ఉంది. ఈ రహదారి నిర్మాణంలో జాప్యం జరుగుతూ వస్తోంది. ఎప్పుడూ వాహనాల రద్దీతో ఉండే ఈ రహదారిని విస్తరించడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు శాశ్వతంగా తీరుతాయి. ఈ రహదారి బీదర్ మీదుగా భాల్కితోపాటు మహారాష్ట్ర వరకు వెళుతుంది. బీదర్ వరకు అధికంగా ట్రాఫిక్ ఉండటంతో జాతీయ రహదారిగా విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి రోడ్ల నిర్మాణం పనులు చేపట్టాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

రాజ్యాంగం రక్షించుకుంటేనే మనుగడ : సీడీసీ చైర్మన్



పాదయాత్రలో పాల్గొన్న రాంరెడ్డి తదితరులు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశ మనుగడ సాధ్యమని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కంబాలపల్లిలో బుధవారం టీపీసీసీ ఆదేశాల మేరకు నిర్వహించిన జైభీమ్, జైబాపు జైసంవిధాన్ పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతీ గడపకు వెళ్లి 'జైభీమ్ జైబాపు జైసంవిధాన్'కార్యక్రమం గురించి వివరిస్తామన్నారు.

కేతకీలో ఎస్పీ పూజలు



పూజలు చేసిన ఎస్పీ పరితోశ్ పంకజ్, చిత్రంలో చైర్మన్ చంద్రశేఖర్, ఈఓ శివ రుద్రప్ప

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం కేతకీ సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పాదప్రక్షాళన చేసి, గుండంలోని జల లింగానికి పూజలు చేశారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వారిని పూలమాలలు, శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను వీరికి అందజేశారు.

'ఆపరేషన్ సిందూర్'కు న్యాయవాదుల మద్దతు



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

సంగారెడ్డి టౌన్ : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆర్మీ జవాన్లు చేసిన 'ఆపరేషన్ సిందూర్'కార్యక్రమానికి పూర్తిగా మద్దతిస్తున్నామని సంగారెడ్డి బార్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...పాకిస్తాన్ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని శాంతియుతంగా ఉండాలన్నారు. లేదంటే భారత పౌరులు అందరూ పాకిస్తాన్‌పై యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌ల కోసమే మోదీ

సీఐటీయూ చుక్కారాములు

పటాన్‌చెరు టౌన్: కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోన్న కేంద్రప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పక తప్పదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు స్పష్టం చేశారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం పటాన్‌చెరు శ్రామిక్ భవన్‌లో జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సమ్మె జయప్రదం చేయాలి

ఎం.యాదగిరి

హత్నూర(సంగారెడ్డి): నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, కేంద్రంలో మోదీ సర్కార్ అనుసరిస్తోన్న కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి పిలుపునిచ్చారు. హత్నూర మండల పరిధిలో ఉన్న పరిశ్రమల్లో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మికలోకం పూర్తి సన్నద్ధంగా ఉందన్నారు. సమ్మె గురించి కార్మికులంతా విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెతో మోదీ సర్కార్ దిగిరావాలన్నారు.

క్లుప్తంగా

వైద్య పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: జిల్లాలోని వివిధ ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులకు కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. దుబ్బాక ఏరియా ఆస్పత్రిలో సీఏఎస్ జీడీఎంవో 1, గజ్వేల్ ప్రభుత్వాస్పత్రిలో సీఏఎస్(గైనకాలజీ) 1, సీఏఎస్ జీడీఎంవో 1, సీహెచ్‌సీ చేర్యాలలో సీఏఎస్ (అనెస్థీతిషియా) 1, సీఏఎస్ జీడీఎంవో 2, సీహెచ్‌సీ హుస్నాబాద్‌లో సీఏఎస్(అనెస్థీతిషియా) 1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. 18 నుంచి 34 ఏళ్లలోపు ఉన్న ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో 8న నుంచి 13వ తేదీలోగా గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రిలో గల సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గల సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆలయంలో విగ్రహం చోరీ

దొంగను పట్టుకున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ఆలయంలో నుంచి దేవత విగ్రహాన్ని చోరీ చేసిన వ్యక్తిని బుధవారం గ్రామస్తులు పట్టుకున్నారు. మండలంలోని మల్లుపల్లి ఆలయంలో ఎల్లమ్మ తల్లి విగ్రహంతోపాటు ఆభరణాలను 3న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. చోరీపై గ్రామానికి చెందిన ఆంజనేయుగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మగ్దుంపూర్ గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే వ్యక్తి చోరీ చేసిన ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని బుధవారం అమ్మేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో దొంతి గ్రామస్తులు గుర్తించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గతంలో ప్రశాంత్ పలు చోరీలతోపాటు ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రఘు(ఫైల్)

నిజాంపేట(మెదక్): మేడ్చల్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజాంపేట మండల కేంద్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కొమ్మట శ్రీనివాస్, నరసవ్వ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరి చిన్న కుమారుడు కొమ్మట రఘు (19) మేడ్చల్ జిల్లాలోని ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుంటాడు. కంపెనీకి కొద్దిదూరం రూమ్ తీసుకొని ఉంటున్నాడు. బుధవారం ఉదయం పని ముగించుకొని బైక్ పై వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.

లారీ ఢీకొని వ్యక్తి

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కర్నాల్‌పల్లి శివారులోని గజ్వేల్ రోడ్డులో బుధవారం చోటు చేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి కథనం మేరకు.. దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన తోడంగి లింగం(50) బైక్‌పై గజ్వేల్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

భవనం స్లాబ్ కూలి ఐదుగురికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: నిర్మాణంలో ఉన్న ఓ భవనం స్లాబ్ కూలి ఐదుగురు కార్మికులకు గాయాలయ్యాయి. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాటిలో చోటు చేసుకుంది. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం పాటి గ్రామంలో బుధవారం నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ రెండో అంతస్తు స్లాబ్ వేస్తున్న క్రమంలో కూలింది. కార్మికులు సూర్యనారాయణ, పాపారావు, క్రిష్ణ, రామారావు, ఈశ్వర్ ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బిల్డింగ్ స్లాబ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే కూలిందని బాధితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్త్రీనిధి.. ప్రగతి సన్నిధి

గేదెల కొనుగోలుకు స్త్రీనిధి రుణాలు

- ఉపాధి పొంది కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్న మహిళలు
- ప్రతినెలా వాయిదా పద్ధతిలో చెల్లింపు
- 500 పాడి పశువులు యూనిట్ల పంపిణీ లక్ష్యం
- రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానం

అతివలను ఆర్థికంగా అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీనిధి వరంలా మారింది. డ్వాక్రా సంఘం ద్వారా పొదుపు చేసే ప్రతీ మహిళ స్వశక్తితో ఎదుగుతూ కుటుంబానికి ఆసరాగా నిలిచేలా చేస్తుంది. ఇందులో భాగంగా పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేస్తుంది. వీటి ద్వారా పశువులను కొనుగోలు చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు జిల్లాలోని పలువురు మహిళలు. – సంగారెడ్డి టౌన్



మహిళా సాధికారతే ధ్యేయంగా గ్రామీణ మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను బలోపేతం చేస్తున్నాయి. ఇందులో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు రుణాలు ఇచ్చి వ్యాపారం చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పాడి గేదెల కొనుగోలుకు మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్త్రీ నిధి రుణాలు మంజూరు చేస్తుంది. పాడి పశువుల యూనిట్లతో సంఘాల సభ్యులు స్వయం ఉపాధికి బాటలు వేసుకునే వీలుంటుంది. వీరిలో ఎక్కువ మంది వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారే కావడంతో పశు పోషణకు కూడా ఇబ్బంది ఉండదు. ఈ ఏడాది జిల్లాకు ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా స్త్రీనిధి ద్వారా 500 పాడి పశువుల యూనిట్లు పంపిణీ లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు అవసరమైన రుణాల పంపిణీకి నిధులను కేటాయించడం విశేషం. ఇప్పటికే 266 యూనిట్లు గ్రౌండింగ్ చేశారు. ఒక్క గేదెకు రూ.85,175 రుణాన్ని అందిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.2.26 కోట్ల రుణాన్ని అందించారు. గ్రామ సమైక్య సంఘం ఆధ్వర్యంలో ప్రతీ గేదె యొక్క వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానం

మహిళా సంఘాలకు పాడి పశువులను అందించడంలో రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉంది. 500 పాడి పశువుల యూనిట్లకు పంపిణీగాను 266 యూనిట్ల గ్రౌండింగ్ పూర్తి చేశారు. స్త్రీనిధి రుణాలతో పాడిపశువులు కొనుగోలు చేసిన మహిళా సంఘాల సభ్యులు పాలతోపాటు పెరుగు, వెన్న, మజ్జిగ, పన్నీరు వంటివి పాల ఉత్పత్తితో తయారైనటువంటివి మార్కెట్‌లో అమ్ముతూ మంచి లాభాలను పొందుతున్నారు. ఇంటి వద్దనే ఉంటూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. రుణ వాయిదాలు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. జిల్లాలో 18,208 సంఘాలుండగా, 1,95,000 మంది సభ్యులు ఉన్నారు. వారికి స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తుంది. రుణాలు తీసుకున్న మహిళలు కూడా నెలనెలా సక్రమంగా రుణాలు కడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కుటుంబానికి ఆసరాగా..



ఐదు నెలల కిందట రూ.85 వేల రుణం తీసుకొని గేదెను కొనుగోలు చేశాను. నిత్యం పాల విక్రయంతో వచ్చే ఆదాయం కుటుంబానికి ఆసరా అవుతుంది. రుణానికి సంబంధించిన డబ్బు నెలనెలా సక్రమంగా కట్టుకుంటున్నాను. కుటుంబానికి ఆసరాగా ఉన్నాను.

– స్వాతి, బొంతపల్లి గ్రామం గుమ్మడిదల మండలం

పాలు అమ్ముతున్నా..



స్త్రీనిధి బ్యాంకు ద్వారా గేదెను కొనుగోలు చేశా. పాలను అమ్ముకుంటూ డబ్బులు సంపాదిస్తున్నాను. బ్యాంకు ద్వారా లబ్ధి పొందుతూ ఇంటి వద్దనే ప్రతిరోజు పాలను అమ్ముతూ జీవనం సాగిస్తున్నాను. ఈ రుణం చాలా ఉపయోగపడింది.

– లక్ష్మి, గొండిగామ గ్రామం నాగల్గిద్ద మండలం

ప్రతీ నెల రూ.21 వేల ఆదాయం



మహిళా సంఘం సభ్యురాలిగా ఉంటూ స్త్రీనిధి ద్వారా గేదెలకు రుణాన్ని తీసుకున్నాను. ప్రతీ నెలా వాయిదాల రూపంలో కట్టుకుంటూ మంచి ఆదాయం పొందుతున్నాను. రూ.70కి లీటర్ పాలను విక్రయిస్తూ ప్రతీ నెల రూ.21 వేల వరకు సంపాదిస్తున్నాను.

– లలిత, అమీన్పూర్ మండలం

సద్వినియోగం చేసుకోవాలి



స్త్రీనిధి రుణాలను సంబంధించిన గ్రామ గ్రామైక్య సంఘం స్థాయిలో జరిగేలా చూస్తున్నాం. మహిళలకు రుణాలు అందించి వారికి జీవనోపాధి కల్పిస్తున్నాం. పాడి గేదెలను అందించి పాల వ్యాపారంలో రాణించేందుకు కృషి చేస్తున్నాం. పాల విక్రయాల ద్వారా నెలనెలా బ్యాంకు, వాయిదాలు సక్రమంగా చెల్లిస్తున్నారు.

– శ్రీనాథ్, స్త్రీనిధి బ్యాంకు మేనేజర్

రెండవ కాంచీపురంగా వర్ధరాజుల స్వామి ఆలయం



మహోత్సవంలో చిన్న జీయర్ స్వామి, ఎంపీ ఈటల రాజేందర్

- చిన జీయర్ స్వామి, ఎంపీ ఈటల రాజేందర్
- వైభవంగా ఆలయ విగ్రహ పున:ప్రతిష్ఠ మహోత్సవాలు

మర్కూక్(గజ్వేల్): వర్ధరాజుల స్వామి ఆలయంలో విగ్రహ పున:ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో చిన జీయర్ స్వామి పాల్గొని కార్యక్రమాలను పర్యవేక్షించారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఎంపీ ఈటల రాజేందర్ వేడుకల్లో భాగస్వాములయ్యారు. వీరికి ఆలయ వేద పండితులు పూర్ణ కుంభాభిషేకంతో స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఉదయం 10 గంటలకు విగ్రహ పున:ప్రతిష్ఠ కార్యక్రమానికి అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా చిన జీయర్ స్వామి మాట్లాడుతూ.. కాంచీ పురంలో ఏ పద్ధతిలో ఆలయాల అభివృద్ధి జరుగుతుందో.. మర్కూక్ మండలంలోని వర్ధరాజ్‌పూర్ శ్రీశ్రీశ్రీ భూనీలా సమేతా వర్ధరాజుల స్వామి ఆలయం అదే విధంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి పారవశ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు దైవ అనుగ్రహం పొందాలని ఇలాంటి పురాతన ఆలయాలను సందర్శించి దైవ భక్తిని చాటుకోవాలన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అప్పాల ప్రవీణ్, లక్కాకుల నరేశ్, బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో పట్లోళ్ల కుంట



ఆక్రమణకు గురైన పట్లోళ్ల కుంట

- ఉసిరికపల్లిలో దర్జాగా పంట వేసిన వైనం
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామంలో పట్లోళ్ల కుంట 25 ఎకరాల ఆయా కట్టను కలిగి ఉండేది. ఈ కుంట నీరు సాగుకు, పశువులు తాగడానికి ఉపయోగించేవారు. కానీ ప్రస్తుతం ఈ కుంట కబ్జా కోరల్లో చిక్కుకొని ఆనవాళ్లే లేకుండా పోతోంది. గ్రామానికి చెందిన పలుకుబడిన ఓ వ్యక్తి తన పట్టా భూమిని ఆనుకొని ఉన్న 8 ఎకరాల 23 గుంటల పట్లోళ్ల కుంట శిఖం భూమిని కబ్జా చేశాడు. ఆ భూమిని చదును చేసి దర్జాగా పంటను సాగు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. చెరువుల రక్షణ, బాధ్యత రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులదే అయినప్పటికీ అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వారి తీరుపై స్థానికులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా 209 సర్వే నంబర్‌లో గల పట్లోళ్ల కుంట 8 ఎకరాల 23 గుంటల శిఖం భూమి కలిగి ఉంది. ఈ శిఖం భూమిలో ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు. ఆక్రమణపై విచారణ జరిపించి కబ్జాను తొలిగిస్తామన్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

ఉసిరికపల్లిలోని పట్లోళ్ల కుంట కబ్జాపై విచారణ చేపట్టి ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ కుంట 25 ఎకరాల ఆయా కట్టను కలిగి ఉంది. దీని ఆక్రమణపై పూర్తి స్థాయిలో సర్వే చేయిస్తాం. ఎవరైనా చెరువు, కుంటలు ఆక్రమిస్తే ఆయా కట్టదారులు తమకు ఫిర్యాదు చేయాలి.

–నిషిత, ఇరిగేషన్ ఏఈ, వట్‌పల్లి

సాగుపై అవగాహన అవసరం

రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములు నాయక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాములు నాయక్, తదితరులు

కంది(సంగారెడ్డి): పంటల సాగుపై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములు నాయక్ సూచించారు. కంది మండలంలో 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించి సేంద్రియ విధానంతోపాటు అధిక దిగుబడులను సాధించేందుకు రైతులకు మెళకువలను వివరించారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ.. క్రిమి సంహారక మందులు, రసాయన ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతిని పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులను వినియోగించడం వల్ల వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయక్, ఏడీఏ లక్ష్మీ, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ స్పందన, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, శాస్త్రవేత్తలు కిషన్, సత్యనారాయణ ఏఈఓ భీనా, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేటఅర్బన్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గజ్వేల్ మండలం పిడిచేడ్ గ్రామానికి చెందిన వల్లగల్ల మహిపాల్ (35) కు కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన పుష్పతో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. అప్పటి నుంచి ఖమ్మంపల్లిలోనే ఉంటూ కూలీ పనులు చేసుకునేవాడు. భార్య గ్రామంలో మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తుంది. తాగుడుకు బానిసైన మహిపాల్ ఎలాంటి పనిచేయకుండా రోజూ ఇంట్లో గొడవ పడుతుండేవాడు. బుధవారం ఉదయం సైతం గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎన్సాన్‌పల్లి శివారు కిష్టసాగర్ రోడ్డులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై త్రీటౌన్ సీఐ విద్యాసాగర్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో చేపలు మృత్యువాత

హత్నూర మండలం దౌలాపూర్ పెద్ద చెరువులో ఘటన



చనిపోయిన చేపలు

హత్నూర (సంగారెడ్డి): అనుమానాస్పద స్థితిలో చేపలు మృతి చెందిన ఘటన బుధవారం హత్నూర మండలం దౌలాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. అమ్మకానికి వచ్చిన సమయంలో ఇలా చేపలు మృతి చెందడంతో మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. సుమారు 5 టన్నుల పైగా మృతి చెందినట్లు పేర్కొన్నారు. చెరువులోని నీటిలో గుర్తు తెలియని వ్యక్తులు విష పదార్థాలను కల్పినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి విచారణ చేసి ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు.

ఒంటిపై పెట్రోల్ పోసి గుర్తు తెలియని మహిళ హత్య

చేగుంట(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన చేగుంట మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారి మక్కరాజ్‌పేట బ్రిడ్జి సమీపంలో వెలుగు చూసింది. పోలీస్‌ల కథనం మేరకు.. చేగుంట శివారులోని జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించారు. రామాయంపేట సీఐ వెంకటరాజంగౌడ్, చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 40 నుంచి 45 ఏళ్ల మహిళ ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టి హత్య చేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏసీపీ విచారణ

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామంలో అసైన్‌మెంట్ భూమి విషయంలో కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సదరు వ్యక్తి జిల్లా పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం ఏసీపీ మధు భూమి వద్దకు వచ్చి విచారణ చేపట్టి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజ్ ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి ఐదు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 11 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.16 వేల జరిమానా విధించారు. వీరిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

కందకాలు.. భూగర్భంలోకి జలాలు

ఉపాధి హామీ పనుల్లో భాగంగా అడవుల్లో తవ్వకాలు

- కొడిపల్లి మండలంలో జోరుగా పనులు
- వర్షపు నీరు ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచడానికి అవకాశం
- కూలీలకు రోజు పని



కొడిపల్లి మండలం లింగంపల్లి అడవిలో తవ్విన కందకాలు

కొడిపల్లి(నర్సాపూర్): ప్రస్తుతం భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటి పోతున్నాయి. జలాల పెంపునకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేస్తుంది. గ్రామాల్లో ఇంకుడు గుంతలు, రైతుల పంట పొలాల్లో ఫామ్ పండ్ (పంట కుంటలు)తోపాటు అడవిలో కందకాలు తవ్వే పనులు చేస్తున్నారు. ప్రతీ వర్షం చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా కొడిపల్లి మండలంలోని పలు గ్రామాలు తండాల్లో కందకాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపట్టడంతో కూలీలకు పని కూడా దొరికింది.

కూలీలకు జోరుగా పనులు

వేసవి సందర్భంగా కూలీలకు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు లభిస్తుండగా కందకాల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం మండలంలో కొట్టాల, లింగంపల్లి, శేరితండా, కొత్త చెరువు తండా, నాగ్సాన్‌పల్లి, దేవులపల్లి, మర్రిచెట్టు తండా, పీర్లతండా, సలాబత్‌పూర్, జాజీతండా, కుషన్‌గడ్డ తండాల్లో కందకాల పనులు జరుగుతున్నాయి. ప్రతి రోజూ మండలంలో సుమారు 3 వేల మంది కూలీలు పనులు చేస్తుండగా ఎక్కువగా కందకాల తవ్వే పనులు చేస్తున్నారు. ఎక్కువగా కొట్టాల పంచాయతీ పరిధిలో కందకాల పనులు జరుగుతున్నాయి. ఈ పనులతో కూలీలకు పనులు, భూగర్భ జలాలు పెరిగేందుకు దోహదపడుతున్నాయి.

5 మీటర్ల పొడవు, మీటర్ వెడల్పు..

కందకాలు తవ్వడం వల్ల రెండు రకాల ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అటవీ భూముల్లో నేలపై వాలుకు అడ్డంగా కందకాలు తీస్తే వర్షం నీరు కందకాల్లో చేరి భూగర్భ జలాలు పెరుగుతాయి. దీంతోపాటు భూమిపైపొరలో ఉన్న సారవంతమైన మట్టి వర్షానికి కొట్టుకుపోకుండా ఉంటుంది. కూలీలు 5 మీటర్ల పొడవు, మీటర్ వెడల్పు, అరమీటర్ లోతుతో కందకాన్ని తీస్తున్నారు. నేల వాలుకు అడ్డంగా కందకాన్ని తీయడంతో వర్షం కురిసినప్పుడు నీరు వాలుకు వెళ్తూ కందకాల్లో చేరి భూమిలోకి నీరు ఇంకుతుంది. ఉపాధి పనుల్లో ఇద్దరు కూలీలు ఒక కందకాన్ని తీయడం వల్ల కూలీలకు రూ.307 వస్తుందని ఉపాధి హామీ ఈఓ ప్రేమ్ కుమార్ తెలిపారు.

భూగర్భ జలాలు పెరుగుదల



అటవీ భూముల్లో భూగర్భ జలాల అభివృద్ధి కోసం అటవీ శాఖ కృషి చేస్తుంది. అడవిలో మొక్కలు లేని ప్రదేశంలో కందకాలు తవ్వడం, చెక్‌డ్యామ్‌లు, పర్కులేషన్ ట్యాంక్‌లు, కాల్వకు అడ్డుగా రాళ్ల తెట్టెల ఏర్పాటు తదితర పనులు చేస్తాం. ఉపాధి హామీలో ప్రత్యేకంగా నేలవాలుకు అడ్డంగా కందకాల తవ్వకంతో వర్షానికి భూసారం కొట్టుకుపోకుండా ఆగడంతోపాటు భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడుతాయి.

– అర్చన, ఎఫ్ఆర్ఓ కొడిపల్లి

ఉపాధితో ఉపయోగకరమైన పనులు



ఉపాధిహామీ పథకంలో ప్రజలకు సమాజానికి ఉపయోగకరమైన పనులను చేస్తున్నాం. అటవీ భూముల్లో కందకాలు తీయడం రైతుల పొలాల్లో ఫామ్ పండ్ తవ్వడంతో వర్షం నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాల అభివృద్ధి జరుగుతుంది. దీంతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రైతులకు అవగాహన కల్పించి ఫామ్ పండ్‌లను తవ్విస్తున్నాం. గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

– శ్రీనివాస్, ఎంపీడీఓ కొడిపల్లి